# మాయపొర

"ఇంకా ఏమోననుకున్నా, ఆ రాధాకిష్టమూర్తి బొత్తిగా నాసిరకం..."

"వొట్టి కుళ్లుమోతు, ఇంకోడు తనకన్న బాగా పాడితే సహించలేడు...!"

"ఎట్లా తెలుసా? అడిగి కనుక్కోవాలా ఏమిటి? ఈ రెండు నెలల్లోనూ ఒకసారి మాటవరసకైనా నన్ను పాడమని అడగలేదు. తన మాదిరిగా ఆంధ్రా సైగల్ను కాకపోవచ్చు గాక, అంతో ఇంతో పాడతాను గదా! –

లేక, నా పాట విని తన పెళ్లాం మోహిస్తుందని భయమో...! నాకు తెలీదనుకున్నావా? వొట్టి అనుమానం మనిషి."

"ఈ రెండు నెల్లనుంచీ నేను రోజూ వెళ్లి చూస్తూనే ఉన్నాగా నాటకమంతా...?"

"పిసినిగొట్టు కూడానూ... రోజూ నేను బయల్దేర దీసేదాకా కాఫీ హోటలుకు లేవడు. అప్పుడైనా ఏదో వంక పెడతాడు, పదిన్నర అయింది, భోజనం వేళ అయింది, ఇప్పుడేం కాఫీ హోటలంటాడు. కావలిస్తే కాఫీ ఇంట్లో పెట్టిస్తానంటాడు. తీరా వచ్చినాక మొహమాటానికి బిల్లు తను తీసుకుని డబ్బిచ్చేస్తాడు – ఏడుస్తూనూ" అన్నాడు నా మిత్రుడు.

"కాఫీ హోటలుకు పిలుచుకుపొయ్యేవాడు డబ్బిచ్చుకోక తప్పుతుందా? ఏడుస్తూ అయినా ఇచ్చుకోవలసిందే" అన్నా.

నా మిత్రుడు నాకేసి కొంచెం వింతగా చూసి ఏదో అనబోయి నోరు తెరిచి మళ్లీ మూశాడు.

"రెండు నెల్ల నించీ రోజూ ఇదే వరసా?" అని అడిగా.

"రెండు నెల్లనించి రోజూ ఇదే వరస!" అన్నాడు, నా అమూల్య మిత్రుడు.

***ముద్రణ : ఆనందవాణి, 27 జూలై 1947***